
ఆంధ్రజ్యోతి



సంబరాల సంక్రాంతి
8



గాలిపటం ఎగరవేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



గోదావరిఖని నుంచి కరీంనగర్‌కు రాజధానిలో రూ. 210 టికెట్

ప్రయాణికులకు అందించే వాటర్ బాటిల్, స్నాక్స్ ప్యాకెట్

ఆర్టీసీ 'వడ్డన'

- బస్సుల్లో వాటర్, స్నాక్స్ పేరిట అదనపు వసూలు
- సూపర్ లగ్జరీలో వాటర్ బాటిల్ రూ. 10
- రాజధాని, గరుడ బస్సుల్లో వాటర్ బాటిల్, స్నాక్స్ పేరిట రూ.40

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఆర్టీసీ సంస్థ రాజధాని ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో వాటర్ బాటిళ్లు, స్నాక్స్ పేరిట చార్జీ వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ఇష్టం లేని స్నాక్స్, నీళ్లు వద్దన్నా కూడా చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు నెలల క్రితం దీనిని ఆర్టీసీ అమల్లోకి తీసుకువచ్చింది. దీనిపై తీవ్రవ్యతిరేకత వస్తున్నా కూడా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగానే నీళ్ల బాటిళ్లు ఇస్తున్నారోమోనని కొందరు ప్రయాణికులు అనుకుంటున్నారు. జిల్లాలోని గోదావరిఖని, పెద్దపల్లి ప్రాంతానికి చెందిన అనేక మంది విద్యార్థులు కరీంనగర్ హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేస్తున్నారు. అనేక మంది హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్, ఇతరత్రా ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుని జీవిస్తున్నారు. సెలవు దినాల్లో సొంత ఇంటికి వచ్చి వెళ్లిపోతుంటారు. గోదావరిఖని నుంచి హైదరాబాద్ రూటులో ఆసిఫాబాద్, మంచిర్యాల, గోదావరిఖని ఆర్టీసీ డిపోల నుంచి హైదరాబాద్, జేబీఎస్‌ల వరకు నడిపిస్తున్నారు. నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అందులో సీట్లు దొరికే పరిస్థితి లేక చాలా మంది ప్రయాణికులు రాజధాని ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వాటి ఆక్యుపెన్సీ రేట్ కూడా నెల రోజుల నుంచి పెరుగుతూ వస్తున్నది.

● నాలుగు నెలల నుంచి వసూలు..

నాలుగు నెలల నుంచి సూపర్ లగ్జరీ బస్సుల్లో టీఎస్ఆర్‌టీసి జీవా పేరిట అర లీటర్ వాటర్ బాటిళ్లను ప్రవేశపెట్టారు. ఈ బాటిళ్ల పేరిట టికెట్ తీసుకునేటపుడు 10 రూపాయలు అందులో కలిపే తీసుకుంటున్నారు. తక్కువ దూరం ప్రయాణించినా, ఎక్కువ దూరం ప్రయాణించినా కూడా బలవంతంగా 10 రూపాయలు వసూలు చేస్తున్నారు. అంతకు ముందు రాజధాని, గరుడ వంటి బస్సుల్లో మాత్రమే బిస్లరీ వాటర్ బాటిళ్లను ఇచ్చే వాళ్లు. ఇప్పుడు జీవా బాటిళ్లను ఇస్తున్నారు. ఈ నీళ్ల ప్రయాణికులు ఎవరు కూడా తాగడానికి ఇష్ట పడడం లేదు. అంత రుచిగా లేకపోవడమే కారణమని తెలుస్తోంది. సగం సగం నీళ్ల తాగి బస్సుల్లోనే వదిలేస్తున్నారు. మొదట రాజధాని, గరుడ వంటి బస్సులకే పరిమితమైన వాటర్ బాటిళ్లను సూపర్ లగ్జరీల్లో ప్రవేశ పెట్టారు. అలాగే అక్టోబరు నుంచి రాజధాని, ఇతర ఏసీ బస్సుల్లో వాటర్ బాటిల్‌తో పాటు ట్రూ గుడ్ సంస్థ ఉత్పత్తి చేస్తున్న టీఎస్ఆర్‌టీసీ మిల్లెట్ స్నాక్ ప్యాకెట్లను ఇస్తున్నారు. ఈ రెండింటి పేరిట 40 రూపాయలు వసూలు చేస్తున్నారు. గోదావరిఖని నుంచి కరీంనగర్‌కు రాజధాని బస్సులో వెళ్లాలంటే 210 రూపాయలు చెల్లించాలి. సూపర్ లగ్జరీలో 140 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ రెండు సర్వీసుల మధ్య 70 రూపాయల వ్యత్యాసం ఉన్నది. స్నాక్స్ రెండింటిని ప్రయాణికులకు బలవంతంగా అంటగడుతున్నారు. ఈ విషయం చాలా మంది ప్రయాణికులకు తెలియదు. ఈ బస్సులను వన్ మెన్ సర్వీస్ కిందనే నడిపిస్తుండడం వల్ల డ్రైవర్లు ప్రయాణికులకు టికెట్లు ఇచ్చే సమయంలోనే వాటర్ బాటిల్‌తో పాటు స్నాక్స్ ప్యాకెట్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వడం లేదు. ప్రయాణికులు అడిగితే తప్ప ఇవ్వడం లేదు. ఒకవేళ ఇచ్చినా కూడా వాటిని తీసుకునేందుకు ఇష్టపడడం లేదు. అయితే వాటర్, స్నాక్స్ రుచిగా లేవని ప్రయాణికులు అంటున్నారు. సాధారణంగా లాంగ్ జర్నీ చేసే ప్రయాణికులు బస్టాండ్‌లో ఉండే షాపుల్లోనే బ్రాండెడ్ కంపెనీ వాటర్ బాటిళ్లతో పాటు తనకు నచ్చిన స్నాక్స్‌ను కొనుగోలు చేసి బస్సు ఎక్కుతుంటారు. దీనివల్ల నెలనెలకు వేలల్లో అద్దెలు చెల్లించి టెండర్లలో షాపులను దక్కించుకుంటున్న దుకాణదారులు తీవ్రంగా నష్ట పోతున్నారు. సాధారణంగా సూపర్ లగ్జరీ, రాజధాని వంటి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులే ఎక్కువగా వాటర్ బాటిళ్లు, స్నాక్స్ కొనుగోలు చేస్తుంటారు. తమకు అవసరం లేకున్నా కూడా ఆర్టీసీ సంస్థ వాటర్ బాటిళ్లు, స్నాక్స్ పేరిట అదనంగా బాదుతుండడంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం మారినా కూడా వాటిని అలాగే కొనసాగిస్తున్నారు. ఈ విషయమై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఆర్టీసీ ఎండీ వెంటనే స్పందించి అదనపు బాదుడును ఎత్తివేయాలని, బలవంతంగా తమ నుంచి డబ్బులు వసూలు చేయవద్దంటూ ప్రయాణికులు కోరుతున్నారు.

బల్మూరి వెంకట్‌ను వరించిన ఎమ్మెల్సీ

● ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎమ్మెల్సీ పదవి మళ్లీ జిల్లాకే దక్కింది. హుజూరాబాద్ శాసనసభ్యుడిగా గెలుపొందిన పాడి కౌశిక్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానం మళ్లీ ఇక్కడి వారితోనే భర్తీ అయింది. హుజూరాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ పదవి దాదాపు ఖరారైనట్లు తెలిసింది. బల్మూరి వెంకట్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు హుజురాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కడంతో మళ్లీ హుజూరాబాద్‌కు, ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం లభించినట్లయింది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లికి చెందిన వెంకట్‌ను పార్టీ అధిష్ఠానం 2021లో జరిగిన హుజురాబాద్ ఉప ఎన్నికలో పోటీలో నిలిపింది. ఉపఎన్నికకు ముందు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరడంతో అక్కడ పార్టీకి సరైన అభ్యర్థి లేకుండా పోయారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బల్మూరి వెంకట్‌ను పోటీకి నిలిపింది. ఉప ఎన్నిక తర్వాత కూడా మళ్లీ టికెట్ ఇస్తామని ఆ సమయంలో ఆయనకు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వకుండా వొడితెల ప్రణవ్‌కు అవకాశం కల్పించారు. హైదరాబాద్‌లోని ఏదైనా స్థానం నుంచి పోటీ చేయాలని వెంకట్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పార్టీ నాయకత్వం ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన రెండు స్థానాల్లో ఒకదాన్ని వెంకట్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుని ఎమ్మెల్యే ఎన్నికల్లో ఆయనకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసినట్లయింది.

● విద్యార్థుల సమస్యలపై ఉద్యమించి

ఎంబీబీఎస్ పూర్తి చేసిన వెంకట్ విద్యార్థుల సమస్యలపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలపై తీవ్రస్థాయిలో ఉద్యమించారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో ఆయన రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్రలో పాల్గొన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు



మేరకు టీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేక కార్యక్రమాలను చేపడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేశారు.

● ఎమ్మెల్యేల కోటాలో అవకాశం

తెలంగాణ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ రెండు స్థానాలకు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ పార్టీ పోటీకి నిలుపుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వారిద్దరికి ఫోన్ చేసి నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించింది. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు జనవరి 4న నోటిఫికేషన్ జారీ అయింది. ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. 19న నామినేషన్ల పరిశీలన, 22వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. జనవరి 29న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు.

● ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్, ఎండీ అఫ్సర్, రవి, మధు, విజేందర్, శ్రీనివాస్, అంజయ్య, సంపత్‌కుమార్, రత్నాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు





గౌరెడ్డిపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, గుంపులలో బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

- ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జనవరి 16: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని రాఘవపూర్ గ్రామంలో ఆరు లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడెపు వెంకటేషం, ఎంపీటీసీ శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. మంగళవారం మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో ఎస్‌డిఎఫ్ 10 లక్షలు, గ్రామ పంచాయతి నిధులు రూ.29 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారి గ్రామానికి రావడంతో సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయరమణారావుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము కరుణాకర్, కొమ్ము అభిలాష్, సాగర్, రేణుక, మల్లేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కడార్ల శ్రీనివాస్, రాజేందర్, నూగిళ్ల మల్లయ్య, సంపత్, శ్రీనివాస్, బండ శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● జాతర ఏర్పాట్ల పరిశీలన..

సుల్తానాబాద్: మండలంలోని నీరుకుల్లలో ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, జాతరకు తాగునీరు, వసతులు సంబంధించిన అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. జాతర ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కృషి..

ఎలిగేడు: పెద్దపల్లి నియోజకవర్గంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కృషిచేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాల కోసం కృషిచేస్తానని, త్వరలోనే జర్నలిస్టులతో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్, జిల్లా నాయకులు మారం తిరుపతిరెడ్డి, బోయిన వినోద్, నబ్బు సతీష్, కల్లెపల్లి దేవేందర్, ఓంకార్, బొల్లి సత్యం, పిట్టల పరమేష్, గోపి, కృష్ణ, సుమన్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● ముగ్గులపోటీ విజేతలకు బహుమతుల పంపిణీ..

ఓదెల: మండలంలోని గుంపులలో సంక్రాంతి సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు ఎమ్మెల్యే విజయరమణారావు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోటీలో ప్రథమ స్థానంలో విజేత పంజాల అంజలి, అలాగే ద్వితీయ బహుమతి సాధించిన తిప్పని మౌనిక, తృతీయ బహుమతి భాగ్యలక్ష్మికి ఎమ్మెల్యే బహుమతులను అందించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ మానేరు వాగుల క్వారీల మాఫియాను నిలిపివేయాలని, టెండర్ గడువు పూర్తి అయినందున ఏ ఒక్క ఇసుక లారీ కనబడకూడదన్నారు. అలాగే గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకోవచ్చని, ఇకనుంచి ఎలాంటి ట్యాక్సీ లేకుండా ట్రాక్టర్ యజమానులు స్వేచ్ఛగా ఇసుక రవాణ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు సంద మహేందర్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్లల వెంకటేష్ గౌడ్, ఎంపీటీసీ తిప్పారపు శారద,సంపత్, మాజీ ఎంపీటీసీ వేల్పుల రమేష్, మాజీ సర్పంచులు కందాల శ్రీనివాస్, ఉరగొండ లక్ష్మణ్ పాల్గొన్నారు.

'బీజేపీ జిల్లా కమిటీకి ఆమోదం లేదు'

పెద్దపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ ప్రకటించిన జిల్లా కమిటీకి రాష్ట్ర పార్టీ ఆమోదం తెలుపలేదని బీజేపీ జిల్లా ఇన్‌చార్జీ రాంమాధవ్ ఒక ప్రకటన విడుదల చేయడం ఆ పార్టీలో కలకలం రేపుతున్నది. దీంతో ఆ పార్టీ నాయకుల మధ్యన సమన్వయం లేదనేది మరోసారి స్పష్టమైంది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎనిమిది మాసాల క్రితం నియామకమైన రావుల రాజేందర్ జిల్లా కార్యవర్గ నియామకానికి కసరత్తు చేశారు. నలుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, నలుగురు సెక్రెటరీలు, 12 మంది జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు బీజేవైఎం, మహిళా మోర్చా, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు, మొత్తం 26 మందితో కూడిన ప్రకటనను ఈ నెల 14న విడుదల చేశారు. బీజేపీ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా రాష్ట్ర కార్యవర్గం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లో జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేయరాదు.

ఎవరిని సంప్రదించకుండానే జిల్లా అధ్యక్షుడు ఏకపక్షంగా కార్యవర్గాన్ని నియమించారని కొందరు నాయకులు రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుక వెళ్లినట్లు సమాచారం. అయితే జిల్లా అధ్యక్షుడు జిల్లా కమిటీని నియమించేందుకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ రావుల రామ్‌మాధవ్‌ను సంప్రదించారని, మూడు రోజులు ఆగిన తర్వాత కార్యవర్గాన్ని నియమించాలని చెప్పారని సమాచారం. అయినా పార్టీ మాట వినకుండా వ్యవహరించారని తెలుస్తున్నది. దీంతో పార్టీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ప్రకటించిన జిల్లా కమిటీకి రాష్ట్ర పార్టీ ఆమోదం తెలుపలేదని జిల్లా ఇన్‌చార్జీ రాంమాధవ్ ఏకవాఖ్య ప్రకటనను మంగళవారం విడుదల చేయడం ఆ పార్టీలో కలకలం రేపుతున్నది.

సర్పంచ్ సస్పెన్షన్‌పై స్టే

ఓదెల, జనవరి 16: మండలంలోని మడక గ్రామ పంచాయతీ సర్పంచ్ మ్యాడగోని భాగ్యమ్మ సస్పెన్షన్‌పై మంగళవారం హైకోర్టు నుంచి స్టే విధించింది. అలాగే ఉపసర్పంచ్ కోట నిరంజన్‌రెడ్డి పై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 14న కలెక్టర్ సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, వీటిపై సర్పంచ్ హైదరాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అలాగే ఉపసర్పంచ్ సస్పెన్షన్ పై జిల్లా కలెక్టర్ పరిధిలో ఉండగా సస్పెన్షన్‌కు సంబంధించిన వివరణ ఇవ్వడంతో మార్గం సుగమమైంది. అలాగే సర్పంచ్ సస్పెన్షన్‌పై విచారణ నిర్వహించేంత వరకు పదవిలో ఉంచాలని హైకోర్టుకు తెలపడంతో సర్పంచ్ ఈ నెల 31 వరకు గ్రామ సర్పంచ్ పదవిలో కొనసాగేందుకు పొడిగించారు.

ఐపీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కళ్యాణ్‌నగర్, జనవరి 16: ఇంటర్ డినామినేషన్ పాస్టర్స్ ఫెల్లోషిప్(ఐపీఎఫ్) అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డిలైట్‌ను ఎన్నుకున్నారు. మంగళవారం గోదావరిఖని గౌతమినగర్‌లోని గ్లోరియస్ మినిస్ట్రిస్ చర్చిలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బీ రవిపాల్, ఉప కార్యదర్శి ప్రహర్షి, కోశాధికారిగా సాల్మాన్ రాజ్, ఉప కోశాధికారి గాబ్రియల్, కార్యనిర్వహణ సభ్యులుగా ప్రసన్నకుమార్, చంద్రపాల్, డానియెల్, థామస్, రవి వర్మను ఎన్నుకున్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 16: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా దివంగత మేకల యశోద జ్ఞాపకార్థం ఆమె తనయుడు మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు స్థానిక ఎస్ఐ టీ శ్రీనివాస్, సర్పంచ్ గోనె శ్యామ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవ చేయడం అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశం, హెడ్ కానిస్టేబుల్ వీరయ్య, మమత, వార్డు సభ్యులు సముద్రాల రాజేశం, దొమ్మటి శంకరమ్మ, దేవయ్య, ప్రేమలత, మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దొమ్మటి రవి, వెంకటేష్‌గౌడ్, కట్టెపల్లి నరేష్, బుర్ర హరీష్, కాసనగోని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను పరామర్శించిన ఎమ్మెల్సీ

ఓదెల, జనవరి 16 : మండలంలోని కొలనూర్‌లో ఇటీవల జంగా వెంకటమ్మ మృతిచెందగా మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మృతురాలి కుమారుడు హెచ్‌ఎం మనోహర్ రెడ్డిని పరామర్శించారు. తెలంగాణ మ్యాస్ ఫోరం జిల్లా అధ్యక్షుడైన మనోహర్ రెడ్డిని ఓపెన్ హైస్కూల్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావుతో కలిసి పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ రమేష్ ఉన్నారు.

రామగుండం అభివృద్ధికి
డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించండి

- సింగరేణి, జెన్‌కో స్థలాల్లోని ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి - కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 16: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ, ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు పలు విషయాలపై చర్చించారు. ఎమ్మెల్యేలకు సంబంధం లేకుండా డీఎంఎఫ్‌టీ నిధులు ఇతర ప్రాంతాలకు కేటాయించవద్దని, డీఎంఎఫ్‌టీ, ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులు కలెక్టర్ అకౌంట్లలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభావిత ప్రాంతమైన రామగుండానికి అధిక నిధులు ఇవ్వాలన్నారు. రామగుండం నగర పాలక సంస్థతో పాటు పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో డీఎంఎఫ్‌టీ నిధులతో పనులు త్వరగా పూర్తి చేయాలని, కొన్ని పనులు ప్రారంభం కాలేదని, సంబంధిత శాఖల అధికారులను పిలిచి సమీక్ష చేయాలన్నారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని, ముఖ్యంగా గోదావరిఖనిలో వ్యాపార కేంద్రం పునర్‌వైభవానికి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. అక్కడ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి చేయడంతో పాటు విద్యుత్ స్తంబాలను తొలగించి అండర్‌గ్రౌండ్‌లో వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, జెన్‌కో స్థలాల్లోని నిర్మాణాలకు కూడా పట్టాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. మారేడుపాక ఆర్ అండ్‌ఆర్ కాలనీ నిర్వాసితులకు వెంటనే పట్టాలు ఇప్పించాలని కోరారు. రామగుండం నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వకార్యాలయాలకు స్థలాల కొరత ఉందని, విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. వెంటనే సర్వే చేసి ప్రభుత్వ స్థలాల వివరాలు ఇవ్వాలని, అక్కడ కార్యాలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే జ్యోతిరావుపూలే బీసీ హాస్టల్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలన్నారు. రామగుండం నగర పాలకసంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందు వల్ల ఈ సారి గోదావరిఖని, గోలివాడ జాతరకు సింగరేణి, ఎన్టీపీసీ నుంచి సీఎస్ఆర్ నిధులు ఇప్పించాలని సూచించారు. గోదావరిఖని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సేవలందించేలా చర్యలు చేపట్టాలని, అనువైన స్థలం కేటాయిస్తే పక్కా భవనం నిర్మించేలా చర్యలు చేపడుతానని పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో పదేళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించే చర్యలు సరికాదని, వారిని వారధిలో యథావిధిగా కొనసాగించేలా చూడాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నియోజకవర్గానికి చెందిన నాయకులు బయ్యపు మనోహర్‌రెడ్డి, మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, సాంబమూర్తి, పాతిపెల్లి ఎల్లయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


ధర్మారం, జనవరి 16: ప్రభుత్వ విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ధర్మారంలో నిరూపయోగంగా ఉన్న పంచాయతీరాజ్ అతిథి గృహ గదులను ఆయన పరిశీలించారు. రాష్ట్ర రహదారి పక్కన ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న అతిథి గృహాన్ని ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేశారని ఆయన అధికారులను ప్రశ్నించారు. పది లక్షల నిధులతో పంచాయతీరాజ్ శాఖ విశ్రాంతి భవనాన్ని నిర్మించి 2002 అక్టోబరు 25న ప్రారంభించారని ఎంపీడీవో బి. జయశీల వివరించారు. అతిథి గృహంలో ఓ గదిలో 108 అంబులెన్స్ సిబ్బందికి కేటాయించామని ఆమె తెలియజేశారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయతీ స్వశక్తీకరణ్ పురస్కార్ అవార్డుకు మండలం ఎంపికకాగా రూ. 25లక్షల నగదును అందించారన్నారు. ఈ నిధులతో అతిథి గృహం ఎదురుగా మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినట్టు ఆమె వివరించారు. విశ్రాంతి భవనాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ భవనాన్ని మరమ్మతు చేయడానికి అంచనా వ్యయాలను తయారు చేసి తనకు నివేదించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అత్యవసర వైద్య సేవలు అందించే 108 సిబ్బందికి ప్రత్యేకమైన ఓ గది ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో బి జయశీల, పంచాయతీరాజ్ ఏఈ రాజశేఖర్, మండల నాయకులు బొల్లి స్వామి, కాంపెల్లి రాజేశం, చింతల జగన్‌మోహన్‌రెడ్డి, కొత్త నర్సింహం, పాలకుర్తి రాజేశం, సోగాల తిరుపతి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

● అడ్లూరిని కలిసిన యువకులు

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ధర్మారంలో కాంగ్రెస్ నాయకుడు సోగాల తిరుపతి నేతృత్వంలో యువకులు మంగళవారం కలిశారు. ఆయనకు యువకులు పుష్పగుచ్ఛం అందజేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అందిస్తామని ఆయన యువతకు చెప్పారు. దశల వారీగా ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పథకాలు క్షేత్రస్థాయిలోని అర్హులైన నిరుపేదలకు చేరాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.







రైలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని జనగాం రాజు(40) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాజు ఎడమ కాలు మోకాలు కింది వరకు తెగి వేరుగా పడింది. మరో కాలు పాదానికి గాయాలయ్యాయి. కరీంనగర్ 108 సిబ్బంది శంకరయ్య, సంపత్‌లు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడని, అతని ఎడమకాలు తొలగించారని కరీంనగర్ రైల్వే ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బావ్‌పేట్‌కు చెందిన జనగాం రాజు కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్నాడు.

33 ఏళ్లలో 84 దొంగతనాలు

● గోదావరిఖని పోలీసులకు చిక్కిన నిందితుడు

కోల్‌సిటీ, జనవరి 16: అంతర్ జిల్లా గజదొంగ షేక్ సలీం అలియాస్ ఉస్మాన్ అలియాస్ అస్లాం అలియాస్ జగన్(52)ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 25తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ప్రమోద్‌రావు పేర్కొ న్నారు. అంతర్ జిల్లాల్లో చోరీల్లో ఆరితేరిన సలీం దొంగతనాల చరిత్ర 33ఏళ్ల నుంచి కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలం గాణ జిల్లాలు ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అతడు చోరీలకు పాల్పడ్డాడు. పోలీస్ రికార్డుల్లోనే 84చోరీలపై కేసులు నమోదు అయ్యాయి. వరంగల్, చర్లపల్లి, చంచల్‌గూడ, నిజామా బాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జైళ్లలో సలీం అలియాస్ ఉస్మాన్ జైలు జీవితం గడిపాడు. ఇతనిపై గతంలో పీడీ యాక్టు నమోదు అయినా తీరు మార్చుకోలేదు. జైలులో పరిచయం అయిన నేరస్థులు ఒకరు కోల్ బెల్ట్‌లో సింగరేణి కార్మికులు సంక్రాంతికి స్వస్థలాలకు వెళతారని, ఏ ఇంట్లో చోరీ చేసినా గిట్టుబాటు అవుతుందంటూ సలీంకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడు గోదావరిఖనికి వచ్చి రెక్కీ చేసి గోదావరిఖనిలోకి మార్కండే యకాలనీ, ఎల్‌బీనగర్, రమేష్‌నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలోలో చోరీలకు పాల్పడ్డాడు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు ఎత్తు కెళ్లాడు. సాంకేతిక ఆధారాలు, దొంగతనం చేసిన తీరు, పోలీసుల ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌తో చోరీలకు పాల్పడింది సలీం అలియాస్ ఉస్మాన్‌గా గుర్తించారు. అతడు జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలం అమ్మక్కపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని సోమవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంలో కృషిచేసిన క్రైమ్ టీఎం ఎస్ఐ సమ్మయ్య, ఏఎస్ఐ మల్లయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, వెంకటేష్‌ను సీఐ ప్రమోద్‌రావు అభినందించారు. అతని నేరాలపై మరింత దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ-2 ప్రసాద్‌రావు, ఎస్ఐ సమ్మయ్య పాల్గొన్నారు.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి

● 15 ద్విచక్ర వాహనాలు, రూ. 8,500 స్వాధీనం




సాతారం శివారులోని కోళ్ల పందెం స్థావరం

మల్లాపూర్, జనవరి, 16 : మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామ శివారులో గల ఓ మామిడి తోటలోని కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో కోడి పందాలను నిర్వహిస్తున్నారని సమచారం మేరకు దాడులు చేయగా ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుం చి 8,500నగదు, ఆరు కోళ్లు, 15 ద్విచక్ర వాహానాలను స్వాధీనం చేసు కున్నట్లు ఆయన తెలిపారు.

అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి ఖనికి చెందిన మహిపాల్‌రెడ్డి(45) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా హైదరా బాద్ నగరానికి వచ్చాడు. లింగంపల్లి చౌరస్తా వద్ద వైన్ షాపులో అతిగా మద్యం తాగి కాచిగూడ చప్పల్‌బజార్ ఎస్‌పీఎస్ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకొని చనిపోయాడు. సానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.



కోర మీసాల స్వామికి కోటి మొక్కులు

● భక్తజన జాతరగా మారిన కొత్తకొండ ● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది. ఎటు చూసినా క్యూ లైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుని నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపోయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కుమార్, వరంగల్ జిల్లా అధికారులు, ప్రజాప్రతనిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్ రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగాం, నల్గొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు.


దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు, స్వామివారు




మొక్కులు చెల్లించేందుకు వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతర

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతరను నిర్వహిద్దామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కొత్తకొండ జాతరలో స్వామివారికి గుమ్మడికాయ, కోరమీసాలు చెల్లించి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి కొత్తకొండకు భక్తులు వచ్చే విధంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కొత్తకొండ వీరన్నకు కోరమీసాలు సమర్పిస్తే కోరిన కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నానన్నారు.

● కొత్తకొండ జాతరలో వృక్ష ప్రసాదాన్ని మాజీ మంత్రి ఈటల రాజేందర్ వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. గత ఏడు సంవత్సరాలుగా కొత్తకొండ జాతరలో జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి మొక్కలు పంపిణీ చేస్తున్నారు.


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం


మేకల రథం


వృక్ష ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈటల రాజేందర్

పీవీ ఇంటి నుంచి జాతరకు రథం

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కుటుంబీకులు గత 9 దశాబ్దాలుగా కొత్తకొండ శ్రీవీరభద్రస్వామికి ఎడ్ల బండి రథం తిరిగే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. పీవీ తనయుడు పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ మదన్‌మోహన్ రావులు సోమవారం ఎడ్లబండి రథాన్ని ప్రారంభించారు. రథాన్ని అందంగా తయారు చేశారు. పీవీ నర్సింహారావు, పీవీ రాజేశ్వర్‌రావులు గతంలో రథం తమ ఇంటి నుంచి నడపడం ఆనవాయితీ. పీవీ చిన్న కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు ఈ ఆనవాయితీ కొనసాగించారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

సైదాపూర్, జనవరి 16: సైదాపూర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల లక్ష్మి(70) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి సోమవారం మధ్యాహ్నం తమ వ్యవసాయ బావి వద్దకు పని మీద వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దాంతో కుటంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా దొరకలేదు. మంగళవారం ఉదయం తమ వ్యవసాయ బావి పక్కన గల రాము లపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మహేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనిపించాయి. దాంతో గ్రామస్థుల సాయంతో ఆ బావిలో పాతాల గరిగె(అంకెన్లు)తో వెతుకగా లక్ష్మి మృతదేహం లభించింది. తన భార్య లక్ష్మి ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతి చెందిందని, మృతురాలి భర్త గాజుల మొగిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.

ప్రమాదవశాత్తు అసిస్టెంట్ హెల్పర్ మృతి

కోనరావుపేట, జనవరి 16: ప్రమాదవశాత్తు బావిలో పడి సెస్ కార్యాలయంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్న శ్రీరాముల రాజేశం (55) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన శ్రీరాముల రాజేశం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెస్‌లో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. 2011లో యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగ్గా ఉండదు. రోజూ కొలనూరు నుంచి వెళ్లి సిరిసిల్ల పట్టణంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో డ్యూటీకి వెళ్తున్నట్లు భార్యకు చెప్పి బయల్దేరాడు. కొలనూరు శివారులోని వ్యవసాయ బావి పక్క నుంచి వెళ్తుండగా రాజేశం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

సిరిసిల్ల క్రైం, జనవరి 16: సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఓ దుకాణంలో బత్తుల రాజు (38) అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ ఇన్‌చార్జి సీఐ సదన్‌కుమార్ వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలంలోని అవునూరు గ్రామానికి చెందిన రాజు సిరిసిల్లలో సెంట్రింగ్ వర్క్స్ దుకాణం ఏర్పాటు చేశాడు. భవనాలకు సెంట్రింగ్ కాంట్రాక్టు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో సంక్రాంతి పండుగరోజు సోమవారం ఇంటి నుంచి సిరిసిల్లకు వచ్చిన రాజు దుకాణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్లకు వచ్చి రాజుకు జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్లా రెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సెంట్రింగ్ పనుల్లో నష్టాలు రావడమే కాకుండా అప్పులు పెరిగి మనస్తాపం చెంది తన భర్త రాజు ఆత్మ హత్య చేసుకున్నట్లు అతడి భార్య సింధూర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో వలస కూలీ అత్మహత్య

సిరిసిల్ల రూరల్, జనవరి 16: తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్క్ ఇందిరిమ్మ కాలనీలో నివాసం ఉంటున్న వలస కూలీ చంద్రహాస్ (61) అనారోగ్యంతో ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అజాంఘడ్ ప్రాంతంలోని లాల్‌గంజ్ జిల్లాలోని హరిష్‌పూర్ గ్రామానికి చెందిన అయన జీవనోపాధికోసం ఇక్కడికి వచ్చి ఇందిరమ్మకాలనీలో అద్దెకు ఉంటూ టెక్స్‌టైల్ పార్క్‌లో పని చేస్తున్నాడని తెలిపారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న అయన మంగళవారం అద్దెకు ఉంటున్న ఇంటోనే ప్యాక్‌కు ఉరివేసుకుని అత్మహత్య చేసున్నాడని ఇంటి యాజమాని కందికొప్పుల స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

భూ తగాదాలో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో పోస్టులు ● ఇద్దరిపై కేసు

పెగడపల్లి, జనవరి 16: పెగడపల్లి మండలం దోమలకుంటలో భూతగాదా విషయంలో ఇద్దరు రైతులు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒకరి తరువాత ఒకరు పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియోలు తీసుకోవడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఎస్.ఐ సీహెచ్.సతీష్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతుండగా ఇద్దరు జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన తొట్ల శేఖర్‌కు విక్రయించాడు. దీనికి సంబంధించి 31 గుంటల భూమి పట్టా కాగా మిగతాది పెండింగ్‌లో ఉంది. ఇలా కొద్ది రోజులు గడవగా తిరిగి తన భూమి తనకు కావాలని శ్రీనివాస్ శేఖర్‌ను కోరాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకుని భూమి తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గడువు సమయంలో భూమికి సంబంధించిన డబ్బుల చెల్లింపుల విషయంలో గొడవలు తలెత్తగా సోమవారం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ పురుగుల మందు తాగారు. స్థానికులు ఇద్దరినీ జగిత్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శ్రీనివాస్, శేఖర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సతీష్ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురి అరెస్ట్

జగిత్యాలరూరల్/రాయికల్ జనవరి 16: రాయికల్ మండలం భూపతిపూర్ శివారులో మంగళవారం గంజాయి రవాణా చేస్తున్న భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎండీ దిల్షాద్, కడార్ల మహేష్, పెద్దిరెడ్డిజయంత్, దొనిపాల సాయిభరద్వాజ్ తోపాటు ఒక మైనర్ ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళ వారం విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం రాయికల్ ఎస్సై అజయ్ తన సిబ్బందితో కలిసి భూపతిరోడ్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా ఐదుగురు అనుమానాస్పదంగా కలిపించారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుంచి 4.03 కిలోల విలువ గల గంజాయి, రూ లక్ష 750 రూపాయలతో పాటుగా ఐదుసెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై అజయ్, కానిస్టేబుల్స్ సాగర్, సంతోష్, ప్రశాంత్ లను సీఐ అభినందించారు.

అంగారిక టౌన్ షిప్‌లో చోరీ

- 55చదరపు మీటర్ల అల్యూమినియం కండక్టర్ల అపహరణ

తిమ్మాపూర్, జనవరి16: మండలంలోని రామకృష్ణ కాలనీ అంగారిక టౌన్‌షిప్‌లో విద్యుత్ స్తంభాలపై ఉన్న వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎల్ఎండి ఎస్సై చేరాలు, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఏఈ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అంగారిక టౌన్ షిప్‌లో నూతనంగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా వరుసగా సెలవులు రావడంతో పనుల్లో అంతరాయం ఏర్పడింది. ఇదే అదునుగా దొంగలు చోరీకి పాల్పడి 20విద్యుత్ స్తంభాలపై ఉన్న సుమారు 55 చదరపు మీటర్లు(సుమారు450కిలోల) అల్యూమినియం కండక్టర్ల(వైరు) కట్ చేసుకొని ఎత్తుకెళ్లారు. దాని విలువ సుమారు 3లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యుత్ ఏఈ శ్రీధర్ ఎల్ఎండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

సంక్రాంతి పర్వదినాన వేములవాడకు పోటెత్తిన భక్తులు


వేములవాడలో భక్తుల రద్దీ


బద్దిపోచమ్మ ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 16 : సంక్రాంతి పర్వదినాన వేములవాడ పుణ్యక్షేత్రం భక్తజనంతో జాతరను తలపించింది. సోమవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు గత కొద్ది వారాలుగా వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ సోమవారం కలిసి రావడంతో సుమారు 50 వేల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనం కోసం తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా ముందుగా ప్రకటించిన విధంగా గర్భాలయంలో రుద్రాభిషేకం, అన్నపూజ తదితర ఆర్థిక సేవలను నిలిపివేసి శీఘ్రదర్శనం అమలు చేశారు. అయినప్పటికీ శ్రీ స్వామివారి సర్వ దర్శనం కోసం సుమారు మూడు గంటల సమయం, శీఘ్రదర్శనంకు సుమారు గంటకు పైగా సమయం పట్టింది. మేడారం వెళ్లడానికి ముందు భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకునే ఆనవాయితీ ఉండడంతో కోడె మొక్కుల క్యూ లైన్‌లో భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు. ఆలయం నుండి గుడి చెరువు పార్కింగ్ స్థలం వరకు క్యూలైన్లో భక్తులు నిండిపోయారు. దీంతో కోడెమొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వీఐపీల సిఫారసు లేఖలతో వచ్చిన వారు భక్తుల సమాచార కేంద్రం వద్ద చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా సోమవారం సుమారు 50 వేల మంది భక్తులు శ్రీ స్వామివారి దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏఈఓ బి.శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతి రావు, అల్లి శంకర్, ప్రోటోకాల్ విభాగం పర్య వేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, పరిశీలకులు అశోక్, పవన్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో నేడు అభిషేక పూజలు రద్దు

వేములవాడ, జనవరి 16: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో 17వ తేదీ బుధవారం గర్భాలయంలో అభిషేక పూజలు రద్దు చేసినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పాటు బుధవారం ఆలయ హుండీ లెక్కింపు చేపట్టనున్న కారణంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులకు గర్భాలయ ప్రవేశం నిలిపివేశామని, అన్నపూజ టిక్కెట్లను మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల నుంచి జారీ చేస్తామని ఆయన వివరించారు.

రేపు మినీ జాబ్‌మేళా

గణేశ్‌నగర్, జనవరి16: ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు గురువారం ఉదయం 10గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, కరీంనగర్ నందు మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే.దేవేందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేయుటకు పేటీఎంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, పోస్టుల కోసం విద్యార్హత ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, పూర్తిచేసి ఉండాలన్నారు. 18-35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. వేతనం 15,500 నుంచి 21,000 రూపాయలు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9989152622,9849331903నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగిందని స్థానికులు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక ఇన్వర్టర్, ప్రాథమిక పాఠశాలలో గ్యాస్ సిలిండర్, ఒక సీలింగ్ ఫ్యాన్ ఎత్తుకుపోయారని తెలిపారు.


కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల, జనవరి 16: కొండగట్టు అంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో వేలాదిగా కొండపైకి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్ రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం రద్దీగా మారింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

గాలిపటం ఎగురవేస్తుండగా ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

● విద్యుదాఘాతంతో ఒకరు.. భవనం పైనుంచి పడి మరొకరు

కోరుట్ల, జనవరి 16: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో సోమవారం గాలిపటం ఎగరవేస్తుండగా ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని భీముని దుబ్బ ప్రాంతంలో నివాసం ఉంటున్న పూర్ల దుర్గాప్రసాద్ కుమారుడు ప్రశాంత్ 7వ తరగతి చదువుతున్నాడు. మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన తోకల కిష్టయ్య - నర్సు దంపతుల కుమారుడు సాత్విక్ పట్టణంలోని అమ్మమ్మ జుందర్తి సాంబయ్య - ఎల్లయ్య ఇంట్లో ఉండి ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సందర్భంగా సెలవులు రావడంతో సాత్విక్, ప్రశాంత్ ఇద్దరు కలిసి కాలనీలో ఉన్న ఖాళీ ప్రదేశంలో గాలిపటం ఎగురవేయడానికి వెళ్లారు. గాలిపటం ఎగుర వేస్తుండగా విద్యుత్ వైర్లకు తగిలి వేలాడుతుండటంతో సాత్విక్, ప్రశాంత్‌లు గాలిపటం తీయడానికి అక్కడే ఉన్న ఓ భవనం పైకి ఎక్కి తీసే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతంతో సాత్విక్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లి పడిపోయాడు. సాత్విక్ పరిస్థితి చూసి భయపడిన ప్రశాంత్ భవనం నుంచి పరుగు తీసే ప్రయత్నంలో భవనం నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కాలనీ వాసులు ఇద్దరినీ హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరిని ఉన్నత చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటన స్థలంను విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ పరిశీలించారు. పట్టణం శివారులోని 133 కేవీ లైన్ నుంచి కల్లూర్ రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కొరకు ఏర్పాటు చేసిన లైన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగినట్లు ఎస్ఈ తెలిపారు. ఇండ్ల సముదాయాల నుండి సరఫరాను మార్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

చెక్‌డ్యాం కూల్చే యత్నం.. అడ్డుకున్న స్థానికులు

పెద్దపల్లి రూరల్, జనవరి 16: మండంలోని హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్ డ్యాంను కూల్చి వేసేందుకు కొంతమంది దుండగులు ప్రత్నించారు. అక్కడి స్థానికులు, రైతులు అడ్డుకోవడంతో సంఘటన స్థలం నుంచి జారుకున్నారు. పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట, కొత్తపల్లి, మూలసాల గ్రామాలను ఆనుకుని ఉన్న హుస్సేన్‌మియా వాగులో సుమారు ఆరేళ్ల క్రితం వంద ఎకరాల పంటలను సాగు చేసుకునేందుకు సుమారు మూడు కోట్ల వ్యయంతో చెక్ డ్యాంను నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు కింది గ్రామాల రైతులకు సాగు నీరు అందుతోంది. అయితే సోమవారం కొంతమంది చెక్‌డ్యాంను కూల్చేందుకు ట్రాక్టర్ సహాయంతో డిటోనేటర్, జిలెటిన్ స్టిక్స్, డ్రిల్ మిషన్‌తో రాగా స్థానికులు గుర్తించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొనేసరికి దుండగులు అక్కడి నుంచి జారుకున్నారు. సంఘటన స్థలం వద్ద చెక్ డ్యాంను కూల్చేందుకు తీసుకొచ్చిన ఒక డ్రిల్లింగ్ మిషన్, 8 డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. దీంతో రైతులు పోలీసులకు సమాచారం అందించారు. చెక్ డ్యాంను బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, నాయకుడు పల్లె సదానందం, బీఆర్ఎస్ నాయకుడు బాలసాని ఈశ్వర్ గౌడ్ చెక్‌డ్యాంను పరిశీలించారు. ఘటనపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈఈ బుర్ర రాజ్యలక్ష్మీ పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మందుగుండు సామగ్రి లభ్యం..

చెక్ డ్యాంను కూల్చేందుకు వచ్చిన దుండగులు తీసుకొచ్చిన మందుగుండు సామగ్రిని రైతులు పోలీసులకు అప్పగించారు. చెక్ డ్యాంను కూల్చడానికి తీసుకువచ్చిన డ్రిల్ మిషన్, ఎనిమిది డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. వాటిని పెద్దపల్లి పోలీసులకు అప్పగించారు. సాగు నీరు అందకపోతే అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలి కాని కూల్చే ప్రక్రియ చాలా దారుణమైందని పేర్కొంటున్నారు.


చెక్ డ్యాం కూల్చివేతకు తీసుకొచ్చిన సామగ్రి

సంబరంగా సంక్రాంతి

- వాడవాడనా పండుగ వాతావరణం
- హరివిల్లుగా మారిన ముంగిళ్లు
- భక్తిశ్రద్ధలతో మహిళల నోములు



రామగుండంలో ముగ్గు వేస్తున్న మహిళలు



బోయినిపేట లక్ష్మీదేవర ఆలయంలో భక్తులు



గాలి పటం ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, జనవరి 16: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మూడు రోజుల పండుగ సంక్రాంతిని సంబరంగా జరుపుకున్నారు. ఆదివారం భోగి జరుపుకోగా సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ జరుపుకున్నారు. వేకువజామునే మహిళలు, యువతులు ఇళ్ల ముందు రంగురంగుల అందమైన ముగ్గులు వేసి ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గుల్లో పెట్టి పూలు, ధాన్యాలు వేసి అలంకరించారు. ఎక్కడ చూసినా పల్లె వాతావరణం తలపించింది. ఇళ్లలో పిండి వంటలు చేసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గాలిపటాలను ఎగురవేసి సందడి చేశారు. సామూహికంగా నోములు నోచుకున్నారు. గోదావరిఖని చౌరస్తాలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దంపతులు కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. కుటుంబసమేతంగా స్థానికులతో కలిసి గాలిపటాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ఎండీ ముస్తాఫా, నాయకులు కాల్వ లింగస్వామి, పెద్దెల్లి ప్రకాష్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, మారెల్లి రాజిరెడ్డి, ఫజల్‌బేగ్, తిప్పారపు శ్రీనివాస్, బొంతల లచ్చన్న, బొమ్మక రాజేష్ పాల్గొన్నారు. గోదావరిఖని చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హాజరై గాలిపటాలు ఎగురవేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు రఫిక్, నాయకులు మాదాసు రామమూర్తి, బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, అచ్చెవేణు, నూతి తిరుపతి, తోకల రమేష్, దొమ్మేటి వాసు, పొలాడి శ్రీనివాస్, చల్లా రవీందర్‌రెడ్డి, మొహిద్ సన్ని పాల్గొన్నారు.

పాలకుర్తి: సంస్కృతి, సంప్రదాయాల మేళవింపే సంక్రాంతి పండుగ అని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని పుట్నూర్, గుడిపెల్లి, జయ్యారం గ్రామాల్లో పుట్నూర్ ఎంపీటీసీ సభ్యుడు గంగాధరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల ర్యాలీ, గాలి పటాల ఎగురవేత సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. యువత పెద్ద ఎత్తున సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎండ్లబండ్ల ర్యాలీ, పల్లె ప్రజల మధ్య పండుగ జరుపుకోవడం జీవితాంతం తీపి గుర్తుగా మిగిలి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, జీడినగర్ సర్పంచ్ నూర సమ్మయ్య, కన్నాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పర్శవేణి శ్రీనివాస్ యాదవ్, పొన్నం సత్యయ్య గౌడ్, పాలకుర్తి ఎంపీటీసీ దుర్గం కుమార్, మాజీ ఎంపీపీ ఆడెపు రాజేశం, నాయకులు దేవనందుల రాజమొగిళి, చిట్టబోయిన రాజ్‌కుమార్, మాదాసు శ్రావణ్,జంగ సాగర్,కాసార్ల కిరణ్,కేశిరెడ్డి భూమ్‌రెడ్డి,కాసార్ల కరుణాకర్ రెడ్డి,కాసర్ల శుఖర్ రెడ్డి తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతులు,మహిళలు పాల్గొన్నారు.

మంథని: సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు సోమ, మంగళ వారాల్లో ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, మహిళలు వివిధ రకాల నోములు, వ్రతాలను ఆచరించి సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు రంగు వల్లలు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు పెట్టి వేడుకలు నిర్వహించారు. ప్రజలు వివిధ రకాల పిండి వంటలతో సంక్రాంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్న పిల్లలు, యువకులు, యువతులు పతంగులను ఎగురవేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కనుమ నోము వాయినాలను మహిళలు, చిన్నారులకు ఇచ్చి వైభవంగా జరుపుకున్నారు. మకర సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి, శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని రావుల చెరువుకట్టలోని హనుమాన్ ఆలయంలో, శ్రీఅయ్యప్ప ఆలయంలో ఘనంగా పూజ కార్యక్రమాలను దీక్షా పరులు, భక్తులు నిర్వహించారు.



ముగ్గు వేస్తున్న మహిళ, చిన్నారులు

● **వైభవంగా లక్ష్మీదేవర జాతర..**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని బోయినిపేటలో, గుంజపడుగులోని ముదిరాజ్‌లు శ్రీలక్ష్మీదేవర జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముదిరాజ్ కులస్థులు లక్ష్మీదేవరకు బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలోని శ్రీలక్ష్మీదేవర బోనాల వేడుకల్లో, గుంజపడుగు శ్రీభూలక్ష్మి దేవర బోనాల ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో లక్ష్మీదేవరను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఆలయ ప్రదక్షణలు చేసి నైవేద్యం సమర్పించడం, లక్ష్మీదేవర ఈర కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు సబ్బని సమ్మయ్య, గుండా రాజు, అట్టెం రాజు, పోతరవేని లక్ష్మీరాజం, క్రాంతకుమార్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలో మంకర సంక్రాంతి పండగ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ప్రతి ఇంటి ఎదుట మహిళలు పలు రకాల రంగు రంగులతో ముగ్గులు వేసి అలంకరణ చేశారు. పండగను పురస్కరించుకుని పలు రకాల పిండి వంటలను చేసుకున్నారు. మంగళవారం కనుము పండగను జరుపుకున్నారు. ఒకరికి ఒకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ముత్తారం: మండలంలో భోగి సంక్రాంతి కనుమ వేడుకలను ప్రజలు మూడు రోజులపాటు ఘనంగా జరుపుకున్నారు. పిండి వంటలతో సంక్రాంతి, పాడి పశువులకు అలంకరణ చేసి కనుమ రోజున ప్రత్యేకపూజలు నిర్వహించారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీ

ముత్తారం, జనవరి 16 : ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీపాద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలుగా జక్కుల ప్రశాంత్ సీతంపేట టీం 3016 రూపాయలు గెలుపొందగా, రెండవ విజేతలుగా నూనేటి నగేష్ టీం 2016 రూపాయలను కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ గెలుపొందిన ఆటగాళ్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగేష్, మాజీ సర్పంచ్ లు గంగుల రాజలింగు, లింగం రామయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు కూరాకుల పర్వతాలు, లింగం చంద్రయ్య, రావుల రాజయ్య, గంగుల కుమార్, గంగుల రాజయ్య, దుండ్ర మధూకర్, ఆర్గనైజర్ నూనేటి మధూకర్ పాల్గొన్నారు.

పాండిచ్చేరిలో రాఘవపూర్ కళాకారుల ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న రాఘవపూర్ కళాకారులు

పెద్దపల్లి రూరల్, జనవరి 16:పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన ఒగ్గు డోలు కళాకారులూ, కోలాట బృందం కళాకారులు పాండిచ్చేరి రాష్ట్రంలో ని కరైకల్ లో తమ కళలను ప్రదర్శించారు. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో లో పాండిచ్చేరి లో నిర్వహించిన కల్చరల్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుండి పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లి మండలం రాఘవ పూర్ కళాకారులకు ప్రదర్శన కు ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమానికి ఒగ్గు డోలు కుంట సదయ్య బృందం, కోలాటం టీం శ్రీలత బృందం సభ్యులు తమ సభ్యులతో ప్రదర్శన లు అందించారు.ఈ ప్రదర్శనలు నూతనంగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకించినట్లు కళాకారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో కుంట రాజ్ కుమార్, కుంట సదయ్య, జంగిలి దిలీప్, కుంట రజిత, కుంట సోని, ఓరుగల లత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 16 : 5వ తరగతి, ఇంటర్ 2024 ప్రవేశానికి జనవరి 20 వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి ఎం. మంజుల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో 2024-24 విద్యా సంవత్సరానికి గురుకుల ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2023-24వ సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి20లోగా ఆన్‌లైన్‌లో వంద రూపాయలు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని, వివరాలకు https://tgcet.cgg.gov.in నందు సంప్రదించాలని తెలిపారు. ఇంటర్ కొరకు జనవరి 20లోగా ఆన్‌లైలో రెండు వందల రూపాయలు చెల్లించి అప్లై చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 4న ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు https://tsswreisjc.cgg.gov.in నందు సంప్రదించాలని ఎం.మంజుల ఆ ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్‌కు తరలిన న్యూస్ పేపర్ ఏజెంట్స్, బాయ్స్

పెద్దపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి)/కళ్యాణ్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మొదటి మహాసభను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేపట్టగా పెద్దపల్లి జిల్లా నుంచి ఏజెంట్లు, పేపర్ బాయ్స్ తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేపర్ ఏజెంట్లు, పేపర్ బాయ్‌ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు పంజా అశోక్ కోరారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా నుంచి దిడ్డి రాజయ్య, సోమ అంజయ్య, ముస్తాఫా, పంజా అశోక్, కల్వల రాజేశం, రాకేష్, నాగరాజు, చారి, చంద్రమౌళి పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శరత్

మార్కండేయకాలనీ, జనవరి 16: ఎస్సీ వర్గీకరణ జరిగితేనే అంబేద్కర్ ఆశయం నెరవేరుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శరత్ అన్నారు. మంగళవారం మార్కండేయకాలనీలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో మంథని చందు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన పాలకులు అసమానతలను తొలగించకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో అంబాల రాజేందర్, మంద రవి, పల్లె బాపు, దాసరి కిషన్, కాంపెల్లి శ్రీనివాస్, రాజయ్య, సాగర్, అజయ్, రవితేజ, సాగర్ పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విచారణ జరిపించండి

కళ్యాణ్‌నగర్, జనవరి 16: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ల్యాబ్‌ల్లో వినియోగించే కెమికల్ రీ ఏజెంట్స్ కొనుగోలుపై విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆసుపత్రి ల్యాబ్‌లో వాడే కెమికల్ రీ ఏజెంట్స్‌ను మెడికల్ కళాశాల ముఖ్య అధికారి, కొంత మంది ప్రొఫెసర్లు కలిసి టెండర్లు లేకుండానే రూ.30లక్షల కెమికల్స్‌ను కొనుగోలు చేశారని, ఈ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అనుకూలంగా ఉన్న ప్రొఫెసర్ల చేత సంతకాలు తీసుకుని కొనుగోలు జరిపారని, దీనిపై కలెక్టర్ విచారణ జరిపించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించడమే కాకుండా వివరాలను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలని ఓ ఉద్యోగిని ఇబ్బంది పెడితే అతడు సెలవులో వెళ్లాడన్నారు. కెమికల్ రీ ఏజెంట్స్ కొనుగోలుకు సంబంధించిన ఆర్డర్ కాపీలు, కొనుగోలుకు నిర్ణయం తీసుకుని మినిట్స్ బుక్స్‌ను, పూర్తి వివరాలను బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు. ఈ అవకతవకలపై డీఎంఈకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం, జనవరి 16: ధర్మారం మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దీనాకుమారి తెలిపారు. మండలంలో ప్రస్తుతం ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశానికి వంద సీట్లు ఉంటాయని ఇందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె వివరించారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు మిగిలిన సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చే నెల 22లోపు దరఖాస్తులు సమర్పించాలని ఆమె తెలిపారు. ఆదర్శ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



బోనాలతో వస్తున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 16: పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్థుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంక్రాంతి రోజు పెద్దమ్మతల్లికి బోనాలు తీయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల ఊరేగింపు మధ్య ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ముదిరాజ్ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండి పాడిపంటలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చేతి ధర్మయ్య ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీకేపీ గనిని తనిఖీ చేసిన సేఫ్టీ జీఎం



గనిలోకి దిగుతున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 16: ఆర్జీ-2 పరిధిలోని వకీల్‌పల్లె గనిని ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య మంగళవారం తనిఖీ చేశారు. మ్యాప్ ద్వారా గనిలో పనిస్థలాలను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరెడ్డితో కలసి గనిలోకి దిగారు. 3వ సీమ్ టాప్ సెక్షన్‌లో నడుస్తున్న కంటిన్యూస్ మైనర్ పని స్థలాలను తనిఖీ చేశారు. కంటి న్యూస్ మైనర్ వద్ద రక్షణ తో పనిచేయాలని అధికారులకు సాంబయ్య సూచించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సంవత్సరం దగ్గరపడుతున్నందున నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని, లక్ష్య సాధనలో రక్షణను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గని సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్ ఉన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి

కళ్యాణ్‌నగర్, జనవరి 16: గోదావరిఖని అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప స్వామి తిరు ఆభరణాల ఊరేగింపు సందర్భంగా ఆభరణాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు 41రోజులు అయ్యప్ప దీక్ష తీసుకుని కఠిన నిష్ఠతో ఉంటూ పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని, అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం చేయడానికి లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. ఈ ఆభరణాల ఊరేగింపు కళ్యాణ్‌నగ ర్‌లోని రాజస్థాన్ భవన్ నుంచి కోదండ రామాలయ ఆవరణలోని అయ్యప్ప ఆలయానికి చేరుకున్నది. అనంతరం ఆభరణాలను అయ్యప్పకు అలంకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్వినిప్రకాష్, నాయకులు గుమ్మడి కుమారస్వామి, మారెల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.



అయ్యప్ప ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఆర్థిక సహాయం

రామగిరి, జనవరి 16: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద ముత్యం శంకరమ్మకు సింగరేణి ఉద్యోగి రేండ్ల కుమారస్వామి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. శంకరమ్మ ఇటీవల ఇంట్లో ప్రమాదవశాత్తు కిందపడగా తలకు బలమైన గాయం అయ్యింది. శంకరమ్మకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో బ్రేన్ సర్జరీ జరిగింది. కాగా మరోసారి ఆరోగ్య పరీక్షల కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించే పరిస్థితి లేదని తెలుసుకున్న సింగరేణి ఉద్యోగి పది వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు కాట రాజేందర్, పడాల మొగిలి, పొలంపల్లి మల్లయ్య పాల్గొన్నారు.

రేషన్‌షాపుల తనిఖీలు



షాపులో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 16: మండలంలోని గంగారం, మొట్లపల్లి, కిష్టంపేట, జాఫర్‌ఖాన్‌పేట గ్రామాల్లోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ జావిద్‌పాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్, ఈపాస్ మిషన్‌లోని స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సరైన సమయంలో సరుకులు పంపిణీ చేయాలన్నారు. షాపుల ముందు స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ ఉదయశ్రీ, రికార్డ్ అసిస్టెంట్ మహేష్, సిబ్బంది విష్ణు, శ్రీకాంత్ ఉన్నారు.

బేగంపేట్‌లో సోషల్ సర్వీస్ డే

రామగిరి, జనవరి 16: మండలంలోని బేగంపేట్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ యువజన వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ బుర్ర పద్మ హాజరయ్యారు. గ్రామంలో పలు వాడల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బుర్ర శంకర్, శ్రావణ్, సంతోష్, నాంపల్లి కుమారస్వామి, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఎన్‌టీపీసీలో హోటల్ వద్ద ఘర్షణ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

జ్యోతినగర్ జనవరి 16: ఎన్‌టీపీసీలోని ఒక ప్రముఖ హోటల్ వద్ద సోమవారం అర్ధరాత్రి సమయంలో తీవ్ర ఘర్షణ జరిగింది. హోటల్ సిబ్బందితో పాటు మరికొందరికి మద్యం తాగే విషయంలో వివాదం చెలరేగి హోటల్‌లో పని చేసే సిబ్బందిపై దాడి చేసినట్టు తెలిసింది. రెసిడెన్షియల్ ఏరియాలోని ఈ హోటల్ వద్ద రాత్రి గొడవలు జరగడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా హోటల్ యాజమాన్యం వారిని గోదావరిఖనిలోని ఆసుపత్రికి పంపి చికిత్స చేయించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఎన్‌టీపీసీ ప్రాంతంలోని హోటళ్లు పేకాట స్థావరాలకు డెన్‌లుగా మారాయనే పరిస్థితుల్లో ఈ దాడులు జరగడం కలకలం రేపింది. మంగళవారం దాడులు చేసిన వారిని, గాయపడిన వారిని రాజీ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. కమిషనరేట్ నిఘా వర్గాలు సోమవారం రాత్రి జరిగిన ఉదంతాన్ని కమిషనర్‌కు రిపోర్టు చేసినట్టు తెలుస్తోంది.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 16: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ రాష్ట్రప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్, విజయరమణారావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ టీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ అధ్యక్షతన మంగళవారం స్థానికంగా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ భూమిక పోషించిన సంఘం పీఆర్‌టీయూ టీఎస్ అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో ఉన్న పలు సమస్యలపై, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుల గురించి, సీపీఎస్ రద్దు అంశం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సానుకూలంగా స్పందించి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గండు కృష్ణ మూర్తి, సీనియర్ నాయకులు మోత్కూరు నారాయణ, రాష్ట్ర నాయకులు ఓదెలు, రాజన్న, సతీష్ బాబు, రాజమౌళి, శ్రీధర్ రావు,లక్ష్మి ప్రసన్న, రాధ,జిల్లా నాయకులు శ్రీనివాస్, హరికృష్ణ, రాజకీయ ప్రతినిధులు సారయ్య గౌడ్, అన్నయ్య గౌడ్, సంపత్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడి మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 16: మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన జంగపల్లి కనుకయ్య (53) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా కనుకయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారని, ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ఆరోగ్యం కుదుట పడక పోవడంతో ఈ నెల 10న ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్ తరలించిరు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

అవిశ్వాసాలతో కుట్రలు పన్నుతున్న కాంగ్రెస్

- ప్రలోభాలకు ఎవరు గురి కావద్దు - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

పెద్దపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిలా, మండల పరిషత్, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలకు తెర లేపిందని, ఇది సరైన విధానం కాదని, పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎవరు కూడా ప్రలోభాలకు గురి కావద్దని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డితో కలిసి మాట్లాడారు.

నెల రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తున్నామని అన్నారు. పూర్తి స్థాయిలో ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి పనిచేస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కొత్త కుట్రలకు తెరలేపారన్నారు. జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లపై తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాల న్నారు. గడిచిన ఎన్నికల్లో తమ పార్టీపై అబండాలు వేసి, అబద్దాలతో తప్పుడు ప్రచారం చేసి గెలుపొందారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి అనేక అభివృద్ధి పనులు చేశారని అన్నారు. పార్టీ బీఫామ్ ఇస్తే పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నేతల ప్రలోభాలకు గురి కావద్దని అన్నారు. అవిశ్వాసాల సమయంలో పార్టీ విప్ జారీ చేస్తుందని, విప్ జారీ చేసిన తర్వాత కూడా అందుకు విరుద్ధంగా ఓటు వేస్తే, వారంరోజుల్లోనే అనర్హత వేటు పడుతుందని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గమనిం చాలని కోరుకంటి చందర్ కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు తగరం సుమలత శంకర్‌లాల్, పుస్కూరి పద్మజ జితేందర్‌రావు, గంటా రాములు, ఆముల నారాయణ. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘు వీర్ సింగ్, పార్టీ నాయకులు పాల రామారావు, ఉప్పు రాజుకుమార్ పాల్గొన్నారు.



జడ్పీటీసీ సభ్యులతో జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్యేలు